GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 276 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | సోమవారం 27-05-2024 | పేజీలు : 4

## గుజరాత్‌లో ఘోరం

### - 33కు చేరిన మృతుల సంఖ్య

**టి మీడియా, మే 26,రాజ్‌కోట్ (గుజరాత్) :** గుజరాత్ రాజ్‌కోట్‌లోని గేమ్‌జోన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతుల సంఖ్య 33కు చేరుకుంది. ఈ నేపథ్యంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారిలో టీఆర్‌పీ గేమ్‌జోన్ యజమాని యువ్‌రాజ్ సింగ్ సోలంకితోపాటు దాని మేనేజర్ నితిన్ జైన్ కూడా ఉన్నారు. ఇక, ఈ ప్రమాద ఘటనపై ప్రభుత్వం సిట్‌ను నియమించింది. సీనియర్ పోలీస్ ఆఫీసర్ నేతఅత్వంలో సిట్‌ను నియమించగా.. 72 గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.



# అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ దందా

## జనావాసాల మధ్య నిర్భయంగా

**టిమీడియా,మే26,హైదరాబాద్:**

ఖజానానింపేందుకుసర్కార్అన్నిరకాలఆదాయమార్గాలనుఅన్వేషిస్తుంటే, కొందరు కేటుగాళ్లు అడ్డగోలు దందాలతో తూట్లు పొడుస్తున్నారు. హైదరాబాద్ మహానగరం శివారులో యథేచ్ఛగా అక్రమ గ్యాస్ దందా కొనసాగుతోంది. జనావాసాల మధ్య నిర్భయంగా అక్రమ గ్యాస్ రిఫిల్లింగ్ చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తాజాగా ఎస్‌వోటీ పోలీసులు జరిపిన దాడుల్లో అక్రమ దందా బండారం బయటపడింది.ప్రస్తుత కాలంలో ప్రజల నిత్యావసరాలపై ఎవరికి నచ్చిన విధంగా వారు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న సంఘటనలు చాలానే చూస్తున్నాం. ఇదే క్రమంలో గ్యాస్ వినియోగంలో కూడా ప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తగా ఉండడం కూడా ఎంతో ముఖ్యం. కానీ, కొందరు మాత్రం గ్యాస్ విషయంలో ఏ మాత్రం భయం లేకుండా ప్రవర్తిస్తున్నారు. అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ దందా చేస్తూ కావల్సినోడికి కావాల్సినంత సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతి లేకుండా ఇలా అక్రమంగా రీఫిల్లింగ్ చేయడం చట్టరీత్యా నేరం అని అధికారులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా పెడచెవిన పెట్టేవారే ఎక్కువ అయ్యారు. డబ్బులకు ఆశ పడి ఇలాంటి అక్రమచర్యలకుపూనుకునిదందాకొనసాగిస్తున్నారు.తాజాగా హైదరాబాద్ మహానగర శివారు ప్రాంతం జల్‌పల్లిలో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ దందా బయటపడింది. గో గ్యాస్ కమర్షియల్ సిలిండర్స్ నుంచి భారత్, ఇండేన్ సిలిండర్స్ లోకి మారుస్తూ సొమ్ము చేసుకుంటున్నారు కేటుగాళ్లు.జనావాసాల మధ్యే ఇలా ప్రమాదకరంగా అక్రమ దందా వ్యవహారం కొనసాగుతోంది. దీనిపై పక్కా సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేసి 100గ్యాస్సిలిండర్లనుస్వాధీనంచేసుకున్నారు.అక్రమదందాలకుపాల్పడుతున్న నిందితులను అరెస్ట్ చేశారు. అనంతరం వారిని పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు.



# దూసుకెళ్తున్న రెమాల్ తుఫాన్

### రాష్ట్రాలకు అలర్ట్




**టి మీడియా, మే 26,ఢిల్లీ :**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడుతోంది. దీనికి రెమాల్ తీవ్ర తుపానుగా నామకరణం చేశారు వాతావరణ శాఖ అధికారులు. గంటకు 7కిలోమీటర్ల వేగంతో ఈ తీవ్ర తుపాను ప్రయాణిస్తోందని చెబుతున్నారు. బంగ్లాదేశ్ %-% కేపుపారాకు దక్షిణంగా 260 కిలోమీటర్ల దూరంలో.. వెస్ట్ బెంగాల్ సాగర్ ఐలాండ్స్?కు 240 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం అయి ఉన్నట్లు తెలిపారు. రెమాల్ తుఫాను ఉత్తర దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడునుంన్నట్లు సూచిస్తున్నారు. దీని ప్రభావంతో పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతంలోని సముద్రం మొత్తం అల్లకల్లోలంగా మారింది. తుఫాను గాలి దాటికి అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ప్రస్తుతం వెస్ట్ బెంగాల్ తీరం వెంబడి గంటకు 95-105 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. అత్యధికంగా 115 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు చెబుతున్నారు. ఈరోజు మే 26 అర్ధరాత్రి బంగ్లాదేశ్ కేపూపారా %-% వెస్ట్ బెంగాల్ సాగర్ ఐలాండ్ మధ్య తీరం దాటనున్నట్లు చెప్పారు. తీరం దాటే సమయంలో మరింత విజృంభించే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఆ సమయంలో గంటకు 110 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందంటున్నారు. అలాగే అత్యధికంగా 13కిలోమీటర్ల వేగంతో గాలుల తీవ్రత నమోదయ్యే అవకాశం ఉంది. ఉత్తర ఒడిశా, వెస్ట్ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాలకు ఇప్పటికే వాతావరణ శాఖ అప్రమత్తం చేసింది. మత్యకారులు, జాలర్లు వేటకు వెళ్లవద్దని ప్రమాద హెచ్చరికలు కూడా జారీ చేసింది. 27వ తేదీ వరకు సముద్రంలో వేట నిషిద్ధం అని ఆదేశాలు జారీ చేశారు అధికారులు. తెలంగాణ మీదుగ ఆవర్తనం కొనసాగుతోందని తెలిపారు. దీంతో పాటు కేరళ పరిసర ప్రాంతాలపై కూడా మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు చెబుతున్నారు. ఇది పశ్చిమ దిశ నుంచి ఆంధ్రప్రదేశ్ వైపుగా గాలులు వీస్తున్నట్లు వివరించారు. ఈ ఉపరితల ఆవర్తనంతో ఏపీలో పలుచోట్ల చెదురు మొదురు వర్షాలు కురుస్తాయని తెలిపారు. అలాగే ఒకటి రెండు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



### బీజేపీ పట్ల ప్రజల్లో
## విముఖత
### ప్రియాంక గాంధీ

**టి మీడియా, మే 26,ఢిల్లీ :**

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సానుకూల వాతావరణం ఉందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. ప్రచారం కోసం తాను ఏ ప్రాంతానికి వెళ్లినా పార్టీకి ప్రజల నుంచి మెరుగైన స్పందన లభిస్తోందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రియాంక గాంధీ పంజాబ్‌లోని పటియాలో పర్యటించారు. ప్రియాంక విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం తాను గమనించానని, బీజేపీ పాలన పట్ల విసిగి వేసారిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ నేతలు నిజాయితీతో పనిచేయాలని కోరుకుంటున్నారనే విషయం ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. ఇక ఎస్పీ-కాంగ్రెస్‌తో కూడిన విపక్ష ఇండియా కూటమి విజయం కోసం పాకిస్తాన్‌లో ప్రార్ధనలు చేస్తున్నారని ప్రధాని అన్నారు. సరిహద్దు వెలుపల నుంచి విపక్ష కూటమికి జీహాదీలు మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని అంతకుముందు యూపీలోని బన్స్‌గావ్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. ఎస్పీ-కాంగ్రెస్ ఓటు జీహాద్‌కు పిలుపు ఇస్తున్నాయని అన్నారు.

## రేకుల షెడ్డు కూలి నలుగురు మృతి

**టి మీడియా, మే 26,నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఇల్లు కూలి నలుగురు మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర సంఘటన తాడూరు శివారులో ఆదివారం చోటు చేసుకుంది. అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి నిర్మాణంలో ఉన్న ఓ రేకుల షెడ్డు కూలి నలుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు కూలీలు, ఇంటి యజమాని మల్లేష్, పదేండ్ల చిన్నారి ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, రాష్ట్రంలో పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీఎన్నికలకు
# సర్వం సిద్ధం

### నేడు 8గంటలకు పోలింగ్ ప్రారంభం
### అన్ని ఏర్పాట్లు పూర్తి



**టిమీడియా,మే26,నల్గొండ బ్యూరో:**

తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారానికి గడువు ముగియడంతో ఇక అందరి దృష్టి పోలింగ్‌పై పడింది. మే27వ తేదీన ఉదయం 8గంటలకు పోలింం ్ప్రారంభంకానుంది. సాయంత్రం నాలుగింటికి ముగియనుంది. పోలింగ్ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారు .జిల్లాల కేంద్రాల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేస్తున్నారు. పోలింగ్ రోజు ఉదయం 6 నుంచి రాత్రి 8గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. 48 గంటలపాటు వైన్ షాపులు బంద్ చేశారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 52మంది బరిలో ఉన్నారు. జంబో బ్యాలెట్ పేపర్‌తో పోలింగ్ నిర్వహించనున్నారు ఎన్నికల అధికారులు. మొత్తం 4లక్షల 63వేల 839 మంది ఓటర్లు ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షా 73వేల 406మంది, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా 23వేల 985, ఉమ్మడి నల్గొండ జిల్లాలో లక్షా 66వేల 448 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ మూడు ఉమ్మడి జిల్లాలపరిధిలో34 అసెంబ్లీనియోజక వర్గాలు న్నాయి. పోలింగ్ డే రోజు ఈ మూడు జిల్లాల్లో ప్రత్యేక సెలవు ప్రకటించారు. అధికారులు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామాగ్రి పంపిణీ చేశారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రేపు జరిగే పోలింగ్ కు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రచారం ముగించిన అభ్యర్థులు ఇక పట్టభద్రుల ఆశీస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యావంతుల ఓటు ప్రాధాన్యత తెలుపడం ఎలాగో తెలుసా..?అయితే సాధారణ ఎన్నికలతో పోల్చితే పట్టభద్రుల పోలింగ్ కాస్త భిన్నంగా ఉంటుంది.. 52 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన నేపథ్యంలో జంబో బ్యాలెట్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఓటర్లు అభ్యర్థులకు అంకె ద్వారా వారి ప్రాధాన్యత తెలపాల్సి ఉంటుంది. ఒకటోవ ప్రాధాన్యత, రెండోవ ప్రాధాన్యత ఇలా వారికి నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది.ఓటు వేసే క్రమంలో ఇంటూ గుర్తు, ఇతర సింబల్స్ రాయకూడదు. మొదటి ప్రాధాన్యత అయితే అక్కడ ఒక నిలువు గీత మాత్రమే పెట్టి వారి ప్రాధాన్యత తెలపాలి. పోలింగ్ బూత్‌లో ఇచ్చిన పెన్ను మాత్రమే వాడాలి. కాదని ఎలాంటి ప్రయోగాలు చేసిన మీ ఓటు బురదలో వేసినట్లే అవుతుందంటున్నారు ఎన్నికల సంఘం అధికారులు. సోమవారం 27వ తేదీ ఉదయం 8గంటల నుండి సా.4 వరకు పోలింగ్ జరుగుతుంది.. 48 గంటల పాటు మూడు జిల్లాల పరిధిలో మద్యం దుకాణాలు మూసి వేశారు. పోలింగ్ రోజు ఉ.6 నుండి సా.8 వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

# త్వరలోనే రైతుభరోసా..

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**టి మీడియా, మే 26,హైదరాబాద్:**

తెలంగాణలో రైతు పంటపెట్టుబడి సాయాన్ని పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో పేర్కొంది. రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పింది. కాగా, పంటపెట్టుబడి సాయం ఎప్పటి నుంచి అందిస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు. తాజాగా రైతుభరోసా రూ.15వేల సాయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక అప్‌డేట్ ఇచ్చారు.రానున్న వానాకాలం సీజన్ నుంచి రైతు భరోసా అమలు చేస్తామని చెప్పారు. పంట వేసుకున్న రైతులకే దీన్ని వర్తింప చేస్తామని ఆయన మరోసారి స్పష్టంగా చెప్పారు. జూన్‌లో ఎన్నికల కోడ్ ముగియగానే రైతుభరోసాపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.దీనికి రైతులు, రైతు సంఘాల నాయకులను ఆహ్వానించి అభిప్రాయాలు తీసుకుంటామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. శాసనసభలో, మంత్రి మండలిలో చర్చించి పథకం అమలు చేస్తామని చెప్పారు. కౌలుదార్లు సాగు చేస్తే



వారికే నిధులు ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

**రుణమాఫీపై క్లారిటీ..**

గత ప్రభుత్వం రూ.లక్ష మాఫీయే సరిగ్గా అమలు చేయలేకపోయిందని మంత్రి తుమ్మల విమర్శలు చేశారు. ఇప్పుడు తాము రూ.2లక్షల రుణమాఫీని కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఒకే దఫాలో మొత్తం రుణమాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారనీ.. ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.రాష్ట్రంలో రైతులు తీసుకున్న రూ.2లక్షల లోపు పంట రుణాలపై వాస్తవ గణాంకాలు ఇవ్వాలని బ్యాంకులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని మంత్రి తుమ్మల చెప్పారు. అంతేకాకుండా అకాల వర్షాలు, వరదలతో పంట దెబ్బతిన్న రైతులను ఆదుకునేలా పంటబీమా పథకం ఉంటుందని మంత్రి తుమ్మల అన్నారు.

## నిమ్స్ వైద్యులను అభినందించిన సీఎం

**టి మీడియా, మే 26, హైదరాబాద్:**



ఛాతీలో బాణం దిగిన ఆదివాసీ యువకుడిని కాపాడిన నిమ్స్ వైద్యులను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రాణాపాయం లేకుండా చాకచక్యంగా బాణాన్ని తొలగించారని 'ఎక్స్' వేదికగా కితాబిచ్చారు. ప్రజల్లో నిమ్స్‌పై ఉన్న నమ్మకాన్ని మరోసారి రుజువు చేశారన్నారు. భవిష్యత్‌లో నిమ్స్ మరింత విస్తృతంగా వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రమాదవశాత్తు ఛాతీలో దిగిన బాణంతో దాదాపు 24 గంటలు విలవిల్లాడుతూ నరకయాతన అనుభవించిన సోది నంద (17) అనే గిరిజన గిరిజన యువకుడికి నిమ్స్ వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన సంగతి తెలిసిందే.

# అదనపు పని..ఆపై 'షోకాజ్'

## సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి

- నోటీసులు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- ఉద్యోగ సంఘం నాయకుల ఆగ్రహం

**టి మీడియా, మే 26,అమరావతి బ్యూరో :**
గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జాబ్‌చార్ట్ ప్రకారం కాకుండా అదనపు పనిచేయించుకుంటున్న ప్రభుత్వం బయోమెట్రిక్ వేయడం లేదనే పేరుతో గ్రామ వార్డు సెక్రటేరియట్ ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించింది. అటెండెన్స్ పేరుతో షోకాజు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించింది. శనివారం నోటీసులను మండలస్థాయిలో ఎంపిడిఓలు, పట్టణాల్లో కమిషనర్లు సిద్ధం చేశారు. సోమవారం నుండి వాటిని జారీచేయనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల మంది ఉద్యోగులుండగా, వారిలో చాలామంది పని ఒత్తిడి కారణంగా ఏదో ఒక సందర్భంలో బయోమెట్రిక్ వేయని పరిస్థితులు ఉన్నాయి. బయోమెట్రిక్ వేయని ఉద్యోగులను గుర్తించి, వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించింది. శుక్రవారం నాడు విజయవాడ గ్రామ వార్డు సచివాలయం రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్ శివప్రసాద్ క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం మండలస్థాయి అధికారులు షోకాజ్ నోటీసులు తయారు చేసే పనిలో నిమగమయ్యారు. గత వారం రోజులుగా అటెండెన్స్ వేయని ఉద్యోగుల వివరాలను సేకరించాలని ఎంపిడిఓలను డైరెక్టర్ ఆదేశించారు. శనివారం సాయంత్రానికి అధికారులు నివేదికను సిద్ధం




చేశారు. దీని అధారంగా సోమవారం నోటీసులు ఇవ్వనున్నారు. అయితే గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యుటేషన్‌పై నియమించారు. వీటితోపాటు ఆరోగ్య సురక్ష, వై ఎపి నీడ్స్ జగన్, ఆడుదాం ఆంధ్ర కింద క్రీడాకారుల ఎన్‌రోల్, కులగణన సర్వే, ప్రభుత్వ సంక్షేమం (హెచ్‌సిఎమ్ లెటర్స్ ఇంటింటికీ పంపిణీ, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు, ఎన్నికల్లో బిఎల్‌ఓ డ్యూటీలు, ఇంటింటికీ ఓటర్ల స్లిప్పుల పంపిణీ, పోలింగ్‌కు కేంద్రాల సంసిద్ధత లాంటి పనులను ప్రభుత్వం చేయించింది. పని ఒత్తిడి అధికంగా ఉండటం, కార్యాలయం బయటకు వెళ్లాల్సి రావడంతో ఒక్కో రోజు బయోమెట్రిక్ సకాలంలో వేయలేకపోయారు. దీన్ని సాకుగా తీసుకుని నోటీసులిచ్చేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడాన్ని సచివాలయ ఉద్యోగులు తప్పుపడుతున్నారు.

### ప్రతిరోజూ మూడుసార్లు బయోమెట్రిక్

సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ మూడుసార్లు బయోమెట్రిక్ హాజరువేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ఎన్నికల సమయంలో ఇలా మూడుసార్లు బయోమెట్రిక్ వేయని ఉద్యోగులను గుర్తించి వారిపై చర్యలకు ఉపక్రమించింది. నోటీసు అనంతరం ఉద్యోగులు ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. శుక్రవారం సమీక్ష నిర్వహించిన సమయంలో ప్రతిరోజూ ఎన్ని నోటీసులు ఇచ్చారు. ఎన్నిటికి వివరణ వచ్చింది. సంతృప్తికరంగా ఉందా? లేదా? అనే అంశాలనూ చేర్చి సాయంత్రానికల్లా కలెక్టర్లకు నివేదిక పంపాలని డైరెక్టర్ సూచించారు. ఎన్‌టిఆర్ జిల్లాలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఇన్‌టైమ్ అటెండెన్స్ కొన్ని మండలాల్లో 44 శాతం, మరికొన్ని మండలాల్లో 30 శాతం లోపు ఉందని అధికారులు గుర్తించి, మిగిలిన వారు విధుల్లో ఉన్నారా లేరా తేల్చాలని ఉన్నతాధికారులు వాయిస్ మెసేజ్ పంపించారు. వేళాపాళా లేకుండా పనులు చేయించుకుంటూ, బయోమెట్రిక్ హాజరు ఒక్కదానినే పరిగణలోకి తీసుకుని తమకు షోకాజ్ నోటీసులిస్తుండటాన్ని ఉద్యోగులు తప్పుపడుతున్నారు. తమ జాబ్ చార్ట్‌తో పాటు ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో తాము భాగస్వామ్యమయ్యామని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు చెబుతున్నారు.



## బేబీ కేర్ హాస్పిటల్‌లో అగ్నిప్రమాదం

- ఆరుగురు శిశువులు మృతి

**టి మీడియా, మే 26,ఢిల్లీ :**
ఢిల్లీలోని వివేక్ విహార్‌లోని న్యూ బోర్న్ బేబీ కేర్ హాస్పిటల్‌లో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆరుగురు నవజాత శిశువులు ప్రాణాలు కోల్పోయారు. ఢిల్లీ అగ్నిమాపక శాఖ ప్రకారం, ప్రమాదంలో చిక్కుకున్న మొత్తం 12 మంది పిల్లలనుల్లో ఆరుగురు మరణించారు. ఒకరు వెంటిలేటర్‌పై ఉండగా, ఐదుగురు ఆసుపత్రిలో చేరారు. రక్షించబడిన నవజాత శిశువులను తూర్పు ఢిల్లీ అడ్వాన్స్ ఎన్ఐసియు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక అధికారి రాజేష్ మాట్లాడుతూ... "రాత్రి 11:32 గంటలకు ఆసుపత్రిలో మంటలు చెలరేగినట్లు సమాచారం అందింది. మొత్తం 16 అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశాయి.

2 భవనాలు మంటలకు దెబ్బతిన్నాయి. ఒకటి ఆసుపత్రి భవనం మరియు కుడి వైపున ఉన్న నివాస భవనం యొక్క 2 అంతస్తులు కూడా మంటల్లో చిక్కుకున్నాయి. 11-12 మందిని రక్షించి వారిని ఆసుపత్రికి తరలించారని" తెలిపారు.



## ఎమ్మెల్యే పిన్నెల్లిని హత్యచేయాలని టీడీపీ యత్నిస్తోంది

- పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు..

**టిమీడియా,మే26,,అమరావతి బ్యూరో :**
కూటమి నేతలు కోరిన అధికారులనే నియమిస్తున్నారు.. హింస జరిగిన తర్వాత కూడా పోలీసులు స్పందించలేదు.. అధికారులు బరితెగించి ప్రవర్తిస్తున్నారు.. అంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్నినాని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్పీ సహా అధికారులకు పిన్నెల్లి ఫిర్యాదు చేశారని.. టీడీపీ దాడులు చేసినా పోలీసులు పట్టించుకోలేదంటూ ఆరోపించారు. వైసీపీ నేతలపై ఏకపక్షంగా కేసులు పెడుతున్నారని.. పాల్వాయిగేట్‌లో దౌర్జన్యం జరిగితే అడ్డుకోలేదన్నారు. టీడీపీ నేతలు హత్యాయత్నం చేస్తే..పోలీసులు ఎందుకు కేసులు పెట్టలేదంటూ పేర్ని నాని ప్రశ్నించారు. అసలు ముద్దాయిలను వదిలేస్తున్నారు.. తప్పు చేయనివారిపై కేసులు పెడుతున్నారంటూ పేర్ని నాని ఆరోపించారు. పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేస్తే.. 13వ తేదీనే ఎందుకు ఫిర్యాదు చేయలేదు.. డీజీపీకి సిట్ ఇచ్చిన నివేదికలో..పిన్నెల్లి ప్రస్తావన కూడా లేదు.. అంటూ పేర్ని నాని పేర్కొన్నారు. ఈ మేరకు పేర్ని నాని ఆదివారం మీడియాతో మాట్లాడారు.పిన్నెల్లిని హత్యచేయాలని టీడీపీ యత్నిస్తోందని.. టీడీపీ కుట్రలకు పోలీసుల సహకారం ఉందంటూ.. పేర్ని నాని ఆరోపించారు. హత్యచేయాలనే ఆలోచనతోనే.. ఎమ్మెల్యే ఇంటిదగ్గర బలగాలను తొలగించారంటూ పేర్ని నాని పేర్కొన్నారు. పిన్నెల్లికి హాని జరిగితే ఐజీ, ఎస్పీ, డిజిపి దే బాధ్యత అంటూ పేర్కొన్నారు.

టీడీపీ నేతలతో కలిసి ఎస్సై నారాయణస్వామి కుట్రలు చేశారని.. అన్ని ఆధారాలతచెబుతున్నామన్నారు. డీజీపీ విచారణ జరిపించాలంటూ పేర్ని నాని కోరారుఇదిలాఉంటే.. పల్నాడులో అల్లర్లపై వైసీపీ వీడియోలు విడుదల చేసింది. వైసీపీ సానుభూతిపరుల నివాసాలు, షాపులపై.. టీడీపీ నేతలు దాడులు చేసిన వీడియోలను పేర్నినాని విడుదల చేశారు.

## నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై పోలీసులు కొరడా

### వీసాల పేరుతో కోట్ల రూపాయలు వసూలు

- మోసపోయి నరకయాతన పడుతోన్న అభాగ్యులు

**టిమీడియా,మే26,కరీంనగర్:**
మోసాల్లో గల్ఫ్ ఏజెంట్ల మోసాలే వేరయా అన్నట్టు ఉంటాయి. ఊళ్లో ఉపాధి అవకాశాలు తక్కువ. వ్యవసాయం తప్ప మరో ఉపాధి ఉండదు. ఇదే వాడికి పెట్టుబడిగా మారింది. ఏజెంట్ల చేతిలో మోసపోయి గల్ఫ్‌లో నరకయాతన పడుతోన్న అభాగ్యులు ఎంతోమంది. లక్షల రూపాయలు దండుకుని, మాయ మాటలతో గల్ఫ్ పంపే ఏజెంట్ల మోసాలుఒకెత్తయితే,అసలుగల్ఫ్‌పంపకుండానే దోచేవారు మరికొందరు. కంపెనీ వీసాల పేరుతో కోట్లరూపాయలు వసూలుచేసి పారిపోయే వారి ఇంకొందరు. ఒకర్నో ఇద్దర్నో కాదు ఏకంగా వందల మందిని నట్టేట ముంచేస్తున్నారు కేటుగాళ్ళు.ఈ నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోలీసులు నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండా మోసాలకు పాల్పడుతున్న నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై సిరిసిల్ల ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సోదాలు నిర్వహించారు. 5 టీమ్‌లగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మూడు కేసులు నమోదు చేశారు. నకిలీ వీసాలు ఇచ్చి విదేశాల్లో ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం వెళ్ళే వారిని మోసం చేస్తే %ూణ% యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసులు విస్తృతస్థాయి తనిఖీలు నిర్వహించారు.నకిలీ గల్ఫ్ ఏజెంట్స్ విజిట్ వీసాలపై జిల్లాలో ఉన్న నిరుద్యోగులని టార్గెట్ చేస్తున్నారు. వారి నుండి అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని మాయ మాటలు చెప్పి ఇక్కడి నుండి గల్ఫ్ దేశాలకి పంపిస్తారు. అక్కడికి అప్పులు చేసి వెళ్లిన తరువాత కంపెనీ వీసా కాదని తెలిసి దేశం కానీ దేశంలో ఎం చేయాలో తెలియక అష్ట కష్టాలు పడి స్వదేశానికి తిరుగు ప్రయాణం అవుతున్నారు. లేదంటే అక్కడే ఏదో చిన్న చితక కూలీ పని చేసుకుంటూ నరకయాతన అనుభవిస్తున్నారు. ఇలా ఏజెంట్ల చేతిలో మోసపోతున్న వారి సంఖ్య క్రమంలో పెరుగుతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నకిలీ ఏజెంట్ల భరతం పడుతున్నారు.అయితే



ఎవరైతే ఏజెన్సీల లేదా ఏజెంట్ల చేతిలో మోసపోయారో వారు నేరుగా పోలీసులకు పిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటున్నారు జిల్లా ఎస్పీ. ఆ పిర్యాదులపై తగిన రీతిలో విచారణ జరిపి నేరం రుజువు అయితే సదరు ఏజెంట్‌పై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో గత సంవత్సరం 43 కేసులు ,ఈ సంవత్సరం 19 కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. నకిలీ వీసాలు ఇచ్చి విదేశాల్లో ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం వెళ్ళే వారిని మోసం చేస్తే సదరు ఏజెన్సీల రద్దు కు సిఫారసు చేయడంతో పాటు వారి పై %ూణ% యాక్ట్ పెట్టడం జరుగుతుందన్నారు.విదేశాల్లో ఉద్యోగాల కోసం, ఉపాధి కోసం వెళ్ళే వ్యక్తులు నకిలీ ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని సూచిస్తున్నారు. జిల్లాలో ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్ళే వారు లైసెన్స్ కలిగి ఉన్న ఏజెంట్లను మాత్రమే ఆశ్రయించాలని సూచిస్తున్నారు. వారి ద్వారానే వీసాలు పొందవలసిందిగా సూచించారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలు తెలుసుకునేందుకు పోలీస్ శాఖ వారిని సంప్రదించవచ్చని సూచించారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోతే సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.



## హృదయ విదారక సంఘటన

- రెండు సంవత్సరాల క్రితం తల్లి ఆత్మహత్య
- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- అనాధలుగా పిల్లలు

**టీ, మీడియా, మే 26 ఆత్మకూరు :**
పట్టణంలో బీసీ కాలనీ లో నివాసం ఉంటున్న, దాసరి ఎల్లప్ప (30)రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు.రెండు సంవత్సరాల క్రితం ఎల్లప్ప భార్య ఆత్మహత్య చేసుకుందని, తల్లి చనిపోయాక పిల్లల ఆలనా పాలన వాళ్ల నానమ్మ చూసుకునేది. సంవత్సరం క్రితం ఆమె కూడా చనిపోగా, పిల్లలిద్దర్నీ ఎల్లప్ప తన బంధువుల ఇంట్లో ఉంచి, హైదరాబాదులోని ఒక కిరాణా షాపులో గుమస్తాగా పనిచేసేవాడు. వీలైనప్పుడల్లా వచ్చి పిల్లల్ని చూసుకునేవాడు. ఖర్చులకు డబ్బులు ఇస్తూ, పిల్లలు ఆలనా పాలన చూసుకునేవాడు. నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో, బైక్ పై ఆత్మకూరుకు వస్తున్న ఎల్లప్పను,కడప నుండి హైదరాబాద్ కు వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు కొత్తకోట ఎన్ హెచ్ 44 రహదారిపై ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందడంతో, ఇప్పుడు పిల్లలు ఇద్దరు అనాధలుగా మారారు.పిల్లలు ఇద్దరినీ చూసుకునే వారు లేక,తల్లి తండ్రి లేని అనాధలుగా మిగిలారు. అభం శుభం తెలియని పసివాళ పరిస్థితి ఏమిటో, అర్థం కావడం లేదని బీసీ కాలనీవాసులు భావోద్వేగానికి గురయ్యారు.




## ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

- ఏడుగురు చిన్నారులు మృతి

**టి మీడియా, మే 26,ఢిల్లీ :**
ఢిల్లీలోని ఓ పిల్లల ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో ఏడుగురు చిన్నారులు మరణించిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. తూర్పు ఢిల్లీలోని వివేక్ విహార్ ప్రాంతంలో ఉన్న బేబీ కేర్ సెంటర్‌లో రాత్రి 11.32గంటలకు అగ్నిప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ప్రమాదం సమయంలో ఆస్పత్రి భవనం నుంచి 12 మంది నవజాత శిశువులను రక్షించామని, అయితే మరో ఆరుగురిని కాపాడలేకపోయామన్నారు. రాత్రి ప్రమాదంపై కాల్ వచ్చిందని, ఆ తర్వాత 8మంది సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో ఘటనా స్థలానికి చేరుకున్నట్టు ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ తెలిపింది. మరో ఘటనలో ఢిల్లీలోని షహదారా ప్రాంతంలోని నివాస భవనంలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే ఐదు అగ్నిమాపక దళ వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని 13మందిని రక్షించి మరో ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

## తెలంగాణలో గుట్కా తయారీ, అమ్మకంపై నిషేధం

**టిమీడియా,మే26,హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరోగ్యానికి హానికరమైన గుట్కాను నిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గుట్కా తయారీ, అమ్మకాలపై నిషేధం విధిస్తూ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మే 24 నుంచి ఏడాది కాలం పాటు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని స్పష్టం




చేశారు. గుట్కా, పాన్ మాసాలలో ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు, నికోటిన్ ఉండడం మూలంగానే వాటిని నిషేధించినట్లు పేర్కొన్నారు. గుట్కాను తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## మటన్‌తో పోటీ..

- చిటారు కొమ్మన చింత చిగురు ధర

**టి మీడియా, మే 26,వ్యవసాయం:**
వేసవి కాలం చివరి రోజుల్లో చింత చెట్లకు ఉన్న ఆకు రాలిపోయి కొత్త గా చిగురు వస్తుంది. దీన్ని కూరల్లో, పప్పులో వేసి తింటారు. కొంతమంది చిగురు ఇగురు కూడా చేస్తారు. చాలా రుచిగా ఉంటుంది. సీజనల్ అయిన చిగురు ఎప్పుడు వస్తుందా అని గ్రామాల్లో జనాలు ఎదురు చూస్తుంటారు. సిటీలో జనాలు కూడా చింత చిగురు డిష్‌లు తినేందుకు ఆసక్తి చూపిస్తుండంతో దాని రేటు బాగా పెరిగింది. చాలా ప్రాంతాల్లో చింత చెట్లు అంతరించిపోవడంతో .. చిగురు కోసం నానా పాట్లు పడుతున్నారు చింత చిగురు ప్రియులు. ఇటీవల కురిసిన వర్షాలకు చింత చెట్లకు లేత ఆకులు చిగురించాయి. దాంతో రుచి చూడాలని చింత చిగురు కోసేందుకు చిన్నా పెద్ద తరలివస్తున్నారు. చింత చిరుగు కోసేందకు రక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు చెట్లు ఎక్కి మరి కొందరు ఒకరి భుజాలపై మరొకర్ని ఎక్కించుకుని చిగురు అందుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మహిళల సైతం చెట్లు ఎక్కి చింత చిగురు కోసే ప్రయత్నం చేస్తున్నారు.గత సంవత్సరం చిగురు కేజీ 400 రూపాయలు ఉంటే ఇపుడు ఏకంగా మటన్ రేటుతో పోటీ పడుతూ కేజీ 600 రూపాయలు పైనే పలుకుతోంది. దీన్ని బిజినెస్ చేసుకుంటున్నారు కొందరు. గ్రామాల్లో చింత చిగురు సేకరించుకొని పట్టణాల్లో కేజీ 600 రూపాయలు చొప్పున విక్రయిస్తున్నారు. సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే దొరుకుతుండటంతో చింత చిగురు రుచి మటన్ రేటుతో పోటీ పడుతుంది. పట్టణాలు, నగరాల్లో ఎక్కడ చూసినా గ్రామాల నుంచి చిగురు తీసుకొచ్చి అమ్మేవాళ్లే కనిపిస్తున్నారు. పుల్ల పుల్లగా ఉండే చిగురు టేస్ట్ ఒక్కసారైనా చూడాలనుకునేవారికి వంద గ్రాములు 60 రూపాయల లెక్ అమ్ముతున్నారు. వినియోగదారులేమో.. వామ్మో ఇంత రేటా అని వాపోతున్నారు. చింత చిగురు చెట్టు కూడా పెద్దగా లేవు.. అలానే సేకరించడం చాలా కష్టం.. అందుకే ఇంత రేటు అంటున్నారు చిగురు అమ్మేవారు.



## కెనరా బ్యాంక్ శాఖలో బంగారం గోల్ మాల్

- రెండు కిలోల తాకట్టు బంగారం మాయం ? • ఆడిట్ లో గుర్తింపు

**టి మీడియా, మే 26,మంగపేట:**
ములుగు జిల్లా మంగపేట మండలంలోని జిల్లా సరిహద్దు ప్రాంతమైన రాజుపేట కెనరా బ్యాంక్ శాఖలో ఖాతాదారులకు చెందిన బంగారం భారీ ఎత్తున గోల్ మాల్ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబందించి వివరాలు ఇలా ఉన్నాయి.రాజుపేట కెనరా బ్యాంక్ శాఖ పరిధిలోని వందలాది మంది రైతులు, వ్యాపారులు తమకున్న వ్యవసాయ, వాణిజ్య, వ్యాపారాల నిమిత్తం బ్యాంకులో తమ బంగారం తాకట్టు పెట్టుకుని రుణాలు తీసుకున్నారు. సుమారు రూ.1.44 కోట్ల విలువ చేసే దాదాపు 2 కిలోల117 గ్రాముల మేర బంగారంను సదరు బ్యాంక్ అప్రైజర్ తన చాకచక్యంతో



కొట్టేసినట్లు వెలుగులోకి వచ్చింది. కెనరా బ్యాంకు శాఖలో ఇటీవల వారం రోజులుగా వార్షిక ఆడిట్ జరుగుతున్న క్రమంలో ఖాతాదారులు గత ఏడాది తాకట్టు పెట్టిన బంగారం నిల్వలను తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారులకు సదరు నిల్వలకు తాకట్టు లెక్కలకు ఏమాత్రం పొంతన కుదరకపోవడంతో ఈ విషయాన్ని ఆడిట్ అధికారులు బ్యాంక్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్ళగా%ూ% బ్యాంకు మేనేజర్ బ్యాంక్ అప్రైజర్ ను సంప్రదించేందుకు ప్రయత్నం చేయగా, ఆయన అప్పటికే గ్రామం నుంచి కుటుంబంతో సహా ఉడాయించినట్లు తెలుస్తోంది.ఈ విషయమై రెండు రోజుల క్రితం స్థానిక మంగపేట పోలీసులకు బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. కాగా సదరు అప్రైజర్ ఏడాదిన్నర కాలంగా నర్సంపేట నుంచి వలస వచ్చి పాలాయిగూడెంలో ఓ ఇల్లు కొనుగోలు చేసి రాజుపేటలో గోల్డ్ షాప్ నిర్వహిస్తూ చుట్టు ప్రక్కల గ్రామస్తులందరినీ మచ్చిక చేసుకొని మర్యాదస్తుడిగా మసలుకొంటూ దొరికిన చోటల్లా ప్రైవేట్ గా అప్పులు తీసుకొని వాటితో పాటు బ్యాంక్ బంగారం నిల్వలతో పరారైయినట్లు తెలుస్తోంది. ఇన్ని రోజులు తాము తాకట్టు పెట్టిన బంగారం బ్యాంకులో ఉందని ప్రశాంతంగా ఉన్న వారు ఈ సంఘటన బయటకు పొక్కడంతో ఆందోళన చెందుతున్నారు.

## భద్రాద్రి ఆలయ అర్చకులకు, వేద పండితులకు మెమోలు

- జారీ చేశారు ఈవో

**టీ, మీడియా, మే 26,భద్రాచలం:**
రామనారాయణ, ప్రవర విషయంలో హైకోర్టు ఉత్తర్వులతో ఐదుగురు సభ్యులకు కమిటీని నియమించింది ప్రభుత్వం. కమిటీ సూచనల మేరకు వివరణ కోరుతూ అర్చకులకు, వేద పండితులకు మెమోలు జారీ చేశారు ఆలయ ఈవో. శ్రీరామనవమి కళ్యాణ సందర్భంగా ప్రవర మార్చి చదువుతున్నారంటూ అర్చకులకు, వేద పండితులపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో పలువురు హైకోర్టును ఆశ్రయించారు.



భద్రాచలంలో దశాబ్ద కాలంగా రామనారాయణుడి వివాదం రగులుతున్నే ఉంది. భద్రాచలంలో రాముడు ఉన్నాడా.. రామ నారాయణుడు ఉన్నాడా.. అనే విషయమై చాలా కాలంగా వివాదం సాగుతుంది. భద్రాద్రి రాముడికి కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మినహా నిత్యం కల్యాణం నిర్వహిస్తుంటారు. ఏటా శ్రీరామనవమి రోజు వైభవంగా కల్యాణ క్రతువు జరిపిస్తుంటారు. ఈ క్రతువులో భాగంగా ప్రవర పఠించేటప్పుడు రాముడిని అర్చకులు రామనారాయణుడు అని సంబోధిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ

## హైదరాబాద్ లో పలుచోట్ల భారీ వర్షాలు

**టి మీడియా, మే 26,హైదరాబాద్:**
హైదరాబాద్ నగరంలో కూడా ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి పొడిగా ఉన్న వాతావరణం.. మధ్యాహ్నానికి ఒక్కసారి గా మారి పోయింది. మధ్యాహ్నం మేఘాలు కమ్మేసి వాతావరణ చల్లగా మారింది. నగరంలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. కర్మన్ ఘాట్, చంపాపేట, ఎల్బీ నగర్, నాగోల్, బంజారాహిల్స్ లలో వర్షం కురిసింది. మరోవైపు చైతన్యపురి, సైదాబద్ మలక్ పేట్ పరిసర ప్రాంతాల్లో కూడా వర్షం కురిసింది.



## రోడ్డుప్రమాదం...

- ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం

**టి మీడియా, మే 26,బూర్గంపాడు :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పినపాక పట్టి నగర్ గ్రామం కిన్నెరసాని బ్రిడ్జిపై కారు, ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో బైక్ పై ఉన్న శెట్టిపల్లి నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు కనితి హర్షవర్ధన్ తీవ్ర గాయాలతో హాస్పటల్లో వైద్యం పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు.కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయ్యింది. బుర్గంపాడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## తహసీల్దార్ నుంచి ఐఏఎస్ దాకా..

# భారీగా బదిలీలు

### -సిద్ధమవుతున్న చిట్టా

**టి మీడియా, మే 26,హైదరాబాద్ :** ఎన్నికలు పూర్తవ్వడంతో ఇప్పుడు పూర్తిస్థాయిలో పరిపాలనపై దృష్టి సారించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రభుత్వ శాఖల్లో సుదీర్ఘకాలంగా ఒకేచోట పాతుకుపోయిన వారికి స్థానచలనం కలిగించనున్నారా? ఆ స్థానాల్లో సమర్థులైన అధికారులను నియమిస్తారా? ఇందుకోసం పాలనాయంత్రాంగంలో తహసీల్దార్ మొదలు సీనియర్ ఐఏఎస్ అధికారి దాకా అన్ని స్థాయుల్లో భారీ బదిలీలకు కసరత్తు జరుగుతోందా? ఈ ప్రశ్నలకు అత్యంత విశ్వసనీయవర్గాలు ఔననే చెబుతున్నాయి.జూన్ 4న లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ పూర్తవ్వగానే, ఆరవ తేదీన కోడ్ ముగుస్తుంది. జూన్ 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రభుత్వ యంత్రాంగంలో భారీ ప్రక్షాళన ఉంటుందని.. వరుసగా బదిలీల ఉత్తర్వులు వెలువడతాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. అవినీతిపై ఫోకస్. రేవంత్ సర్కారు అధికారంలోకి రాగానే.. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)ని బలోపేతం చేసింది. ఆ శాఖలో సమర్థులైన అధికారులతోపాటు.. కోర్టుల్లో కేసులు బలంగా నిలబడి, నిందితులకు శిక్షపడేలా పకడ్బందీ చార్జ్‌షీట్లు రూపొందించే సిబ్బంది, నిందితులు బెయిల్ పిటిషన్‌తో కోర్టులను ఆశ్రయిస్తే.. శక్తిమంతమైన కౌంటర్ వేసే సామర్థ్యమున్న సిబ్బందిని ఏసీబీకి తీసుకొచ్చింది. దాంతో.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది మొదలు.. అవినీతి అధికారులపై దాడులు పెరిగాయి. ఆదాయానికి మించి ఆస్తులున్న అధికారుల అరెస్టులు కూడా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో.. కొన్ని శాఖల్లో ఉన్నతాధికారులు మొదలు మధ్యస్థాయి అధికారులను బదిలీ చేయాలని రేవంత్ సర్కారు నిశ్చయించినట్లు తెలుస్తోంది.సుదీర్ఘకాలం ఒకేచోట ఉన్నవారు..గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు బదిలీలు జరిగినా.. ఒకేచోట తిష్టవేసిన వారిపై సర్కారు ఇప్పుడు దృష్టిసారించింది. కొత్త జిల్లాల విభజన సమయంలోనూ 'ఆర్డర్ టు సర్వ్' కింద సర్దుబాట్లు జరిగినా.. కొందరు ఒకేచోట ఉండిపోయారని గుర్తించింది. నిబంధనల ప్రకారం రెండేళ్లకు మించి ఒకేచోట పనిచేసేవారిని బదిలీ చేయాలి. ఈ క్రమంలో.. ఆర్థిక, రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్యం, పురపాలక-పట్టణాభివృద్ధి, వ్యవసాయం, విద్యుత్తు, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాలు, రవాణా.. ఇలా అన్ని శాఖల్లో బదిలీలు చేపట్టేందుకు సర్కారు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఒకరిద్దరు కీలక ఐఏఎస్ అధికారులను, పెద్ద సంఖ్యలో ఐపీఎసలను బదిలీ చేయనున్నట్లు సమాచారం.పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్లు మొదలు ఎస్పీల దాకా.. రెవెన్యూ శాఖలో తహసీల్దార్ మొదలు.. ఆర్‌డీవో, డీఆర్‌వో, కలెక్టర్ వరకూ బదిలీలు ఉంటాయని స్పష్టమవుతోంది.అటు.. పంచాయతీరాజ్ శాఖలో ఎక్స్‌టెన్షన్ అధికారులతోపాటు.. డివిజనల్ పంచాయతీ ఆఫీసర్లు, జిల్లా పంచాయతీ ఆఫీసర్లు(డీపీవో), జిల్లా పరిషత్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్లకు స్థానచలనం తప్పదని తెలుస్తోంది.




మరోవైపు.. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖలో కొంత మంది సబ్-రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లు, డీఐజీలను బదిలీ చేయనుంది.ఈ శాఖలో 2023 ఆగస్టులో భారీస్థాయిలో బదిలీ జరిగాయి. కొంత మంది సబ్-రిజిస్ట్రార్లు, కింది స్థాయిలో అధికారుల బదిలీలు జరగలేదు. వీరి వల్ల సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు చెడ్డ పేరు వస్తోందన్న ఆరోపణలున్నాయి.ఇలాంటివారిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని సమాచారం. వీటితోపాటు.. ఇంటెలిజెన్స్ నివేదికలు, ఉద్యోగ సంఘాల నేతలతో అంతర్గత చర్చలు జరిగిన సమయంలో సేకరించిన వివరాలను తాజా బదిలీల్లో పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నట్లు సచివాలయ వర్గాల చెబుతున్నాయి.

# విమర్శల్లో నిజం లేదు

### -మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**టి మీడియా, మే 26,హైదరాబాద్:** తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విపక్షాలపై ధ్వజమెత్తారు. హైదరాబాదు గాంధీ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ%ొ% బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆ రెండు పార్టీలు చేస్తున్న విమర్శల్లో నయాపైసా నిజం లేదని అన్నారు. అవాస్తవాలను ప్రచారం చేస్తూ, అవే నిజమని నమ్మించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని, బాధ్యత లేకుండా ఇలా తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పౌరసరఫరాల విభాగం రూ.58 వేల కోట్లు అప్పులు చేసిందని, అందులో రూ.11 వేల కోట్ల మేర నష్టాలేనని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలోనూ గత పాలకులు రూ.20 కోట్ల విలువైన ధాన్యాన్ని రైస్ మిల్లుల వద్దే వదిలేశారని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు.

తాము ఈసారి ముందుగానే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని, రైతులకు చెల్లింపులు కూడా వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరిగింది రూ.200 కోట్లేనని, అలాంటిది రూ.2,000 కోట్ల అవినీతి జరిగిందని ఎలా అంటారని ఉత్తమ్ మండిపడ్డారు. నేను ఉత్తమ్ కుమార్ రెడ్డిని%ొ% నాపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు అని ఆగ్రహం వెలిబుచ్చారు. రాష్ట్రంలో తాను యూ ట్యాక్స్ వసూలు చేస్తున్నానంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి అంటున్నారని ఉత్తమ్ కుమార్ మండిపడ్డారు. వినతిపత్రాలు ఇవ్వాలంటూ సీఎం అపాయింట్ మెంట్ తీసుకుని, తీరా సీఎం చాంబర్లోకి వెళ్లాక ల్యాండ్ సెటిల్మెంట్ గురించి మాట్లాడింది ఎవరని ఎద్దేవా చేశారు. తాను వెయ్యి కోట్లు తీసుకున్నట్టు ఆరోపిస్తున్నారని, బీజేపీ శాసనసభాపక్ష పదవి కోసం ఆయనే ఢిల్లీకి డబ్బులు పంపారేమో అంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీకి డబ్బులు పంపే సంస్కృతి బీజేపీకే ఉందని, ఇకనైనా మహేశ్వర్ రెడ్డి నీచపు మాటలు మానుకోవాలని హితవు పలికారు.

## బడి బట్టలు కుట్టే అవకాశం తమకే కల్పించాలి

### -ఆర్కేపి టైలర్ అసోసియేషన్



**టీ మీడియా, మే 26, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో తెలంగాణ టైలర్ అసోసియేషన్ మందమర్రి మండల్ వినాయక గ్రూప్ అధ్యక్షురాలు కల్పన రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇచ్చే బడి బట్టలను ఆర్కెపిలో పదేళ్లుగా కుడుతున్న తమకు కాకుండా కుట్టు పని రాని వారికి కట్టబెట్టారని రామకృష్ణాపూర్ ఇంద్రానగర్ టైలర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.ఓట్ల కోసం డ్వాక్రా సంఘాలకు పనులు కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం మాకు వద్దన్నా డ్వాక్రా మహిళలకు కేటాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యాశాఖ ద్వారా 28 లక్షల విద్యార్థులకు రెండేసి జతల చొప్పున జతకు 50 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.కానీ ఇప్పుడు ఒక్క జత మాత్రమే కుట్టడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.ఇప్పుడు డ్వాక్రా మహిళాసంఘాల దగ్గర కుట్టు పనివారు తక్కువగా ఉండుట వలన ఆ అవకాశం కార్పోరేట్ కంపెనీల చేతికి పోయే అవకాశం ఉందని ఆరోపించారు.కావున రెండు జతలు కుట్టే బాధ్యత తమకే అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## చెట్టు విరిగిపడి ఇద్దరు దుర్మరణం..

**టి మీడియా, మే 26,బొమ్మలరామారం:** గాలి దుమారంతో కూడిన వర్షాల కారణంగా రోడ్డుపక్కన చెట్లు విరిగిపడి రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మేడ్చల్ జిల్లా కీసర మండలంలోని ఈదురు గాలులతో కూడిన వర్షానికి తిమ్మాయిపల్లి గ్రామ సమీపంలోని కీసర నుండి షామీర్ పేట వైపు వెళ్లే రోడ్డు పక్కన చెట్లు విరిగి ద్విచక్ర వాహనం పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులపై పడటంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే వెంటనే ఇ సి ఐ ఎల్ లోని శ్రీకర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతులు యాదాద్రి జిల్లా బొమ్మల రామారం మండలానికి చెందిన నాగి రెడ్డి రామ్ రెడ్డి (48),ధనుంజయ (45) లుగా గుర్తించారు. మృతుడు ధనుంజయ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడు కాగా, గత కొంతకాలంగా బొమ్మలరామారం మండలం ధర్మారెడ్డి గూడెంలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. మృతులు శామీర్ పేట లోని ఓ న్యాయవాదిని కలిసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. గాలి దుమారం,ఉరుములు మెరుపులతో కూడిన వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,ఇలాంటి సమయంలో బయట ఎవరూ తిరగవద్దని అధికారులు కోరుతున్నారు.



### భారీ వృక్షం విరిగి..

గాలివానకు చెట్టు విరిగిపడి ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన మేడ్చల్ జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని కీసర మండలం తిమ్మాయిపల్లిలో పెద్ద ఎత్తున గాలివాన వచ్చింది. ఆ గాలివానకు చెట్టు విరిగి బైక్ పై వెళ్తున్న వారిపై పడడంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులు రాంరెడ్డి, ధనుంజయ్ లు గా గుర్తించారు.

### ఈదురుగాలులు.. ఉరుములు, మెరుపులు..

రాష్ట్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ లోనూ పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. కీసర, ఘట్‌కేసర్ ప్రాంతాల పరిధిలో భారీ గాలుల నడుమ ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.











## మార్కెటింగ్‌లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్ పని చేయుటకు కావలెను

టీ మీడియా లోని ప్రింట్ /ఈ పేపర్ /పెళ్లి పందిరి /ఆన్లైన్ విభాగం /ఎలక్ట్రానిక్ విభాగం ల లో (టోటల్ తెలుగు మీడియా) మార్కెటింగ్ లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్.. (30నుండి 40శాతం )కమిషన్ బేసిక్ పై పని చేయూటకు ఆసక్తి ఉన్నవారు 8500515365 కి పంపగలరు. అవసరం అయిన శిక్షణ ఇస్తాము. నెలకు కనీసం గా రు 20వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

తమ వివరాలు :

పేరు :........................................................................

ప్రస్తుత నివాసం :.............................చదువు :...............................

సెల్ నెంబర్ :..................................................................